
# అత్తగారు... ఆషాఢం... సేల్...

దుర్గుమహంతి మోహనరావు

'ఆషాఢ మాస తగ్గింపు ధరలు... శ్రావణం మాసం వరకూ పొడిగింపు... మీ ఎన్నిక ఏదైనా. అదే మన్నిక, అదే నాణ్యత... ఆషాఢ, శ్రావణ మాసాల వస్త్ర సంగమం...మా వస్త్ర సంగమం' ప్రతి రేడియో, టీవి కార్యక్రమంలో ప్రకటనల రెప రెపలు, చిటపటలు,



'ఏమండీ.... ఒక్క చీరకి మీరు డబ్బిస్తే...మరో చీర నే తెచ్చుకుంటానండీ...' గోముగా అడిగే పెళ్లాం. ఆ లాజిక్ ఏంటో అర్థం కాని మొగుడు ప్రశ్నకి సమాధానంగా ఫలానా షాపులో ఒక చీర కొంటే మరో చీర ఉచితం అంటండీ...' అంటూదీర్ఘం తీసి చెప్పే పెళ్లాం సమాధానంతో మరి కొన్ని వ్యాపార ప్రకటనలు, 'ధమాకా సేల్' అంటూ దమాక్ ఖరాబు చేసే మరి కొన్ని ప్రకటనలు కలిపి టోటల్‌గా స్త్రీజాతి అయోమయంలో పడిపోయేటట్లు చేసి కొనుగోలుదారు ఏ షాపులో కొనాలో తెలీని పరిస్థితిలో 'హ్యాంగ్' అవుతుంటాడు.

'నా పేరు వందన కదండీ... మనం ఈరోజు 'వందన సిస్టర్స్'షోరూంలో పర్చేజ్ చేద్దాం' అంది వందన కొత్తగా పెళ్లయిన మొగుడు చంద్రంతో

'వద్దు...నాపేరు చంద్రం కదా... అందుకే మనం కుందన బ్రదర్స్‌కి పోదాం' సవాల్ విసిరాడు చంద్రం.

'అబ్బ...బట్టలు కొనిపిస్తున్నది నాకోసం కదండీ...?' కళ్లు తిప్పుతూ వెక్కిరింతగా నోరు తిప్పి అంది ఆమె.

'మరి నాక్కూడా ఒన్ ప్లస్ టు ఫ్రీగా ఇస్తేనే' ఆమె కొంగుపట్టి లాగాడు.

'ఇదిగో రెండు నెలల క్రితం ఈ తాళి కట్టి టోటల్ ఫ్రీగానే పొందుతున్నారు కదా' అంది ఆమె మరింత కరుకుగా

'అమ్మో! ఇప్పుడు వద్దంటే మరో సీన్‌కి దూరమై పోద్దని' మనసులోనే అనుకుని, ఆమె మాటలకి విలువ ఇస్తున్నట్లుగా... 'సరే నీ మాట ఎప్పుడు కాదన్నాను' అన్నాడు. అక్కడకి వాళ్ల పెళ్లయి రెండు నెల్లే అయింది. ఆమెకేదో రెండు పదుల సంసారం గడిపిన విలువ ఇస్తున్నట్లు ఫీలై పోయింది వందన.

'శ్రావణ మాసంలో మా అమ్మ ఎట్టాగు కొనిస్తుంది కదోయి. ఇప్పుడెందుకోయ్!' నెక్స్ట్ ఛాన్స్ చూద్దాం. అన్నట్లు మరో మాట కది పాడు చంద్రం.

'ఆc...కొంటుంది లేవోయ్! ధర ఎక్కువైంది అత్తయ్యా అంటే కోపం. ధర కి తగ్గ లుక్ లేదంటే నా మీదకే మరో లుక్ పడు తుందని నా భయం. ఏమన్నా లుక్కులతోనే చంపేస్తాది మీ అమ్మ. ఈసారి బజారెళ్లినప్పుడు అత్తయ్యని ఫట్ కొట్టండి. పెళ్లయినా ఇంకా అమ్మ కొంగు పట్టుకొని తిరుగుతా రేంటి...హైటెస్ సిటీలో పని

చేస్తున్నారు. అన్నీ హైటెక్ బుద్ధులే వుండాలి' చిన్న క్లాసు పీకింది వందన

'నువ్వెంత బడిబాట పంతులమ్మయితే మాత్రం నాకు ప్రతి పనిలో క్లాసు పీకనవసరంలేదు మేడమ్.' కాస్త స్టూడెంట్‌లా చేతులు కట్టుకుని అని, 'పాపం! మా అమ్మకు చికెన్ గునియా వచ్చిందిగా. ఎట్టాగూ మనతో రాలేదు. వచ్చేవారం షాపింగ్‌కి పోదాం. అప్పటికీ ఆషాఢం చివరి రోజు సేల్స్ మరీ బంపర్‌గా వుంటాది' నచ్చచెప్పడానికి ప్రయత్నించాడు చంద్రం.

'అప్పటి వరకూ మీ అమ్మ గునియా తగ్గుతుందో లేక మనకు గుదిబండలా తయారై మన వెంటబడుతుందో'

'అబ్బా... వందూ... ఆమె సంగతి నే చూసుకుంటాను కదా! నెక్స్ట్ వీక్ పోదాం' ఆమెను సముదాయించేటప్పటికి వీక్ అయి కప్పు టీ కొట్టి సిగరెట్ లాగించాడు చంద్రం.

వందనకి చంద్రంతో పెళ్లయి రెండు నెలలకే 'ఢాం' అంటూ అడ్డొచ్చింది ఆషాఢం. ఇద్దరూ పనిచేస్తున్నది ఒకే సిటీలోనే. వుండడానికి లంకంత ఇల్లున్న ఆషాఢం అత్తాకోడళ్ల ఒక గడప తొక్కకూడదనే నిబంధనతో ఎవరి పుట్టింట్లో వాళ్లు వుంటున్నారు. రోజూ బయట కలుసుకోవడం. సెల్లో మాట్లాడుకోవడం జరుగుతూనే వుంది. ఒకోసారి చంద్రం పట్టపగలే ఆఫీసు ఎగ్గొట్టి 'పగలే వెన్నెలా... జగమే ఊయలా' అంటూ అత్తింట్లోనే తిష్ట వేస్తున్నాడు. పెద్దలు ఆషాఢం పేరుతో గడపని అడ్డుపెట్టగలరు కానీ కుర్రకారుల బుద్ధుల్ని అడ్డుపెట్టలేరుగా అంటూ హాయిగా విహంగ యాత్ర చేస్తున్నారు. ఈ యువ జంట పక్షులు.

ఆషాఢానికి తెలుగింటి అమ్మాయికి అవినాభావ సంబంధం వుందంటే కాదనలేం. అసలు మానవ సంబంధాలన్నీ మాసాలతోనే ముడిపడి వున్నాయంటే తప్పుకాదేమో! ఆషాఢం వస్తే విలేజి పిల్లకాయల నుండి కాలేజీ పిల్లల వరకూ ఎంచక్కా గోరింటాకు పెట్టుకోవచ్చు అని మురిసిపోతుంటారు. పండు ముత్తయిదువలు కూడా గోరింటాకు పెట్టుకుని అలనాటి ముచ్చట్లు తలచుకుని మురిసితారు. కొత్తగా పెళ్లయిన అమ్మాయి ఆషాఢంలో కాస్త అత్త సాధింపులకు దూరంగా వుండి, పుట్టింటి నుండి కొత్త మొగుడితో సరసాలాడొచ్చు అని ఊహించుకుంటుంది. ఇప్పుడైతే సెల్ ఫోన్లు వచ్చి ఆ దూరాన్ని మరింత దగ్గర చేశాయి. కానీ మునపటి రోజుల్లో ఆషాఢంలో తెలివైన అత్త గడపలేని ఇల్లు కట్టించదట. వచ్చే కొత్త కోడలుపని పడదాం అని. ఆషాఢం వస్తే ఈగలకి పండుగే మరి! కప్పు కాఫీలో ఈగ పడింది కనపడలేదా అని పెద్దాయన అడిగితే ఆసాఢం అలా పడుతూనే వుంటాయి తీసి తాగేయండి అంటుంది బాపు కార్టున్లో. ఆషాఢంలో ఎంతగా ప్రేమిస్తారో అమ్మాయిలు, ఆ తరువాత వచ్చే శ్రావణమాసానికి కూడా అంతకు మించి ప్రాధాన్యత ఇస్తారు. ఆషాఢంలో అత్తతో విసుక్కున్న కోడళ్లు, కొత్త పట్టుచీరలతో, కొత్త నగలతో అత్తింటి లక్ష్మీ పూజలతో అత్తగారి అభిమానానికి ఉక్కిరిబిక్కిరి అయిపోకతప్పుదు.

అనుకున్న ఆఖరి వారం రానేవచ్చింది. షాపింగ్ కాంప్లెక్స్‌కి చేరేటప్పటికీ అక్కడంతా చాలా కోలాహలంగా వుంది. సింహం, చింపాంజీ, కోతి, ఎలుగుబంటి వేషాలతో జిరాఫీకాళ్లతో అనేక జంతు ముఖాల మాస్క్‌లతో కస్టమర్స్‌ని ఆకట్టుకోవడానికి అనేక ఇబ్బందులు పడుతూ ఆహ్వానిస్తున్నారు సిబ్బంది బయట. బహుశా మనిషి ముఖాలతో ఆహ్వానిస్తే ముఖం చెల్లక జంతువులే నయం అని భావిస్తున్నారేమో యాజమాన్యం. షాపింగ్ కాంప్లెక్స్ రణగొణ ధ్వనులతో లౌడ్ స్పీకర్ పాటలతో హోరెత్తి పోతోంది. షాపింగ్‌కి ఇరువైపులా పెద్ద బ్యానర్స్ కట్టబడి వున్నాయి. '20 శాతం డిసీవ్ కౌంట్ అని ఒక బ్యానరు, కంప్లైంట్ వివస్త్ర సంగమం' అని మరో బ్యానరు చూసి అవాక్కయిపోయాడు చంద్రం. కారు పక్కనే పార్కు చేసి చంద్రం కౌంటర్లోనున్న సూపర్‌వైజర్ ఆషాఢభూతిని పిలిచి చూపించాడు అక్కడున్న బ్యానర్స్‌ని. ఈసారి నెత్తి బాదుకోవడం అతని వంతయ్యింది.

'అయ్యో...అయ్యో....మన తెలుగు ఇలా తగలబడిపోతోందే... తెలుగురాని, చేతకాని వాడితో రాయిస్తే ఇలాగే తగలబడిపోద్ది. డిస్కౌంట్ బదులు డిసీవ్ కౌంట్ అని, కంప్లీట్ వస్త్ర సంగమం బదులు, కంప్లైంట్ వివస్త్ర సంగమం' అని రాశాడు. తలచెడిన వెధవ పెయింటర్. అందుకే అంటాను రాత్రికి రాత్రే ఏపని చేయొద్దని, నలుగురు కుర్రాళ్లను పిలిచి బ్యానర్స్ పీకించేశాడు ఫ్లోర్ సూపర్ వైజర్.

'సార్...సార్... మీరు చాలా మంచి వాళ్లులా వున్నారు. మమ్మల్ని అర్థం చేసుకున్నారు. మీకో ప్రత్యేక తగ్గింపు ఇప్పిస్తాను సార్' అంటూ లోపలున్న సేల్స్ మేనేజర్‌కి ఎటాచ్ చేశాడు చంద్రం దంపతులను.

చంద్రం భుజాలలెగెరేశాడు భార్య ముందు గర్వంతో... ఇది ఆషాఢభూతి పనే అని గ్రహించలేని చంద్రం.

షాపింగ్ కాంప్లెక్స్ ముందు చాలా రకాల క్యూలున్నాయి. వృద్ధులకు ప్రత్యేక క్యూ, నూతన దంపతులకు క్యూ, జస్ట్ మ్యారీడ్ క్యూలు చూసి మురిసిపోయింది వందన. తను చేస్తున్న షాపింగ్‌కి చాలా డిమాండ్ వుందని. అన్నింటికంటే చివర మరో క్యూ తన కంటపడింది. 'చికెన్ గున్యా క్యూ'.

'అదేమిటండీ... ఇక్కడేమైనా గునియాకి మందిస్తారా' అక్కడున్న సూపర్‌వైజర్‌ని వుండబట్టలేక అడిగింది వందన.


'కాదమ్మా...చాలా మంది గునియా వ్యాధిగ్రస్తులు నిలువలేక, కూర్చోలేక నానా అవస్థలు పడుతున్నారు. గునియా అంటే వచ్చిపోద్ది కానీ మా డిస్కౌంట్ మళ్లీ మళ్లీ రాదు. అందుకే వారికి ప్రత్యేక క్యూ సౌకర్యం కల్పించాం. వారికి మరో 2శాతం డిస్కౌంట్ కూడా' మరి కాస్త స్టంటు జోడించాడు సూపర్‌వైజర్.

'ఈ వందన సిస్టర్స్ ఎంత మంచి వారండీ' అంది వందన మొగుడితో.

'ఒసేవ్! అనవసరంగా దుబారా చేయకు. నీకు నచ్చినవి రెండు తీసుకొని నా సెల్‌కి కొట్టు. నే వచ్చి పికప్ చేసుకుంటాను. అంతవరకూ ఆ బార్‌లోనే టైం పాస్ చేస్తాను' అప్పుడే డ్రాప్ చేసి సలహా ఇచ్చి పోతున్నాడు ముందు చూపు గల కాస్త వయసు మళ్లిన భర్త.

అతని సంభాషణ విని నవ్వుకుంది వందన. ఏ కౌంటర్ చూసినా రద్దీగానే వుంది. చివరకు ఒక






కౌంటర్‌లో సెటిలయ్యారు చంద్రం దంపతులు.

'ఏమండీ ఈ సెక్స్‌సారీ నాకు చాలా బాగుంటుందండీ.... ఎప్పట్నించో కొనాలను కుంటున్నాను. మీకేమో దాని మీద ఇంట్రస్ట్ లేదు' అంది చిన్న తరహా వృద్ధురాలు పక్కనున్న మొగుడిని వుద్దేశించి.

'నీ మొఖం...కాస్త తెలుగు మాట్లాడడం నేర్చుకో. సెక్స్ సారీ కాదు చెక్స్ సారీ అనాలి' గ్రామరు సరిదిద్దాడు అతను.

'అవున్లేండి... మీకు అదంటే పడదు' దీర్ఘం తీసిందామె.

'సరి సరి... నీకు నచ్చింది తీసుకోవే' అతని గుట్టురట్టువుతుందని గదమాయించాడు మగడు.

అప్పటికే ఆ సంభాషణ వందన చెవుల్లో పడింది. ఆమె చంద్రాన్ని గట్టిగా గిచ్చింది. కెవ్వు మన్నాడు అతను. అర్థం కాక చుట్టుపక్కలున్న కస్టమర్స్ వారివైపే చూడసాగారు.

'మనకు కావల్సింది ఈ చీరలు కాదు. ఫాన్సీ... ఫాన్సీ...సారీస్ పదండి ముందుకు' అంటూ అతన్ని రెక్కపుచ్చుకొని ముందుకు తీసుకుపోయింది వందన.

'అయ్యో...వందూ... నా దగ్గర వంద రూపాయలే వున్నాయి. కావలంటే క్రెడిట్ కార్డు వాడుకో' అన్నాడతను.

'అల్లా ఉద్దీన్ అద్భుత దీపంలా అ ఒక్కటీ చాల్లెండి...ప్రపంచాన్ని కొనేయగలం' చూపుడు వేలితో అతని ముక్కు మీద గుచ్చింది వందన. అంతలోనే సెల్ మ్రోగింది.

'సార్ చంద్రం గారూ...మేం కార్డు గీకు-క్రెడిట్ గోకు అనే కొత్త స్కీమ్ ప్రవేశపెట్టాం. క్రెడిట్ ఫెసిలిటీని ఫిఫ్టీ థౌసండ్ వరకూ పెంచాం సార్. మీరు వెంటనే వాడుకోవచ్చు.' క్రెడిట్ మేనేజర్ ఫోన్ చేసి పెట్టేశాడు.

మరో పొలికేక వెయ్యాలనుకున్నాడు చంద్రం. కానీ అప్పటికే వందన వినేసింది. 'అంతా మన మంచికేనండీ. ఈ అషాఢంలోనే శ్రావణ మాసానికి కావల్సిన చీరలు కూడా కొనుక్కోవచ్చు.' అని అతని జేబులో చేయి పెట్టి కార్డు తీసుకొని తన బ్యాగులో పెట్టుకుంది.

'కార్డూ..కార్డూ... ఎందుకు పుట్టావే...అంటే నా బంగారు క్రెడిట్ నోట్లో వేలుపెడితే అప్పు పుట్టనా?' అన్నట్లుంది ఈ కార్డుల వ్యవహారం. మనసులోనే గొణుక్కున్నాడు చంద్రం.

'మేడమ్ ఈ సారీ కట్టుకుంటే ఇలియానాలా వుంటారు...మేడమ్ ఈ సారీ కట్టుకుంటే బిపాసాబసులా వుంటారు.... ఈ చీర కట్టుకుంటే టకియాలా వుంటారు...' అక్కడున్న సేల్స్‌పర్సెన్స్ నచ్చచెపుతున్నారు వందనకి. వాళ్లు చెప్పిన వాళ్లు ఎవరూ కూడా పూర్తి చీర కట్టిన దాఖలాల్లేవు సినీ చరిత్రలో.

'వందూ... ఏమయ్యింది...త్వరగా కానీ...' విసుక్కున్నట్లు ముఖం పెట్టేడుచంద్రం.

'ఇదిగో అయిపోయిందండీ... ఈ ఐదు చీరలు ఆషాఢం స్పెషల్. ఈ పది డైలీ యూసేజ్. ఈ రెండు శ్రావణం. మరోకటి వరలక్ష్మీ వ్రతానికి. టోటల్‌గా 15వేలే అయ్యిందండీ' అంటూ చీరలన్నీ ఒకేసారి చూపింది వందన.

క్రెడిట్ ఫేస్ పెట్టాడు చంద్రం. ఎక్సిట్ గేటు దగ్గర బిల్లు చూసి గన్నీ క్యారీ బ్యాగు కూడా ఇస్తున్నారు. వాళ్లు ప్యాకెట్స్ అన్నీ గన్నీ బ్యాగులో సర్ది బయటపడేంతలో దూరంగా చికెన్ గున్యా క్యూలో కాస్త వంగి కుంటుకుంటూ ఓ పెద్దావిడ, ఆమె పక్కనే తెల్లని బట్టలతో మరో అతను కనిపించారు వందనకి.

'ఏమండీ...అత్తా, మామ కలిసి వచ్చారండీ... వాళ్లు మనల్ని చూశారేమో! ఈ గునియాతో బాధపడుతూ ఎందుకొచ్చినట్లో మీ అమ్మ తొందరగా పదండి అక్కడి నుండి లుక్ వేసిందంటే నేను, నా బ్యాగు మాతాష్ అయిపోతాను' అంటూ మొగుడిని జబ్బ పుచ్చుకొని బయటకు ఈడ్చుకొచ్చింది వందన. బయటకు రాగానే పెద్దగా క్రేకర్స్ కాలుతున్నాయి. ఢాం...ఢాం... శద్దం. 'అమ్మో! అత్తయ్య చూసే వుంటుంది. ఆ చూపులకే ఇది కాలిపోతుంది' విసుగ్గా చూసింది వందన.

'అమ్మాయి వందనా...నీ కోసమే వచ్చానమ్మా. వరలక్ష్మీ వ్రతం వస్తుంది కదా అని నీకో మంచి పట్టుచీర కొన్నాను. నీకు నచ్చుతుందో లేదో కాస్త చూసిపొమ్మనండి' హీన స్వరంతో బయటకు తరిమింది వందన అత్తగారు.

కానీ అప్పటికే వందన, చంద్రం కారు పార్కింగ్ దగ్గరకి చేరుకున్నారు. ఆషాఢం సేల్ 50 లక్షలు చేరుకున్న సందర్భంగా మెగా క్రేకర్స్ కాలుస్తున్నారు మెగాషోరూం వందన సిస్టర్స్. ఆషాఢాం ఢాం...ఢాం... శబ్దాలలో అత్తగారు అన్న మాటలు వందనకు వినిపించే అవకాశమే లేదు. మామగారు తమ కోసమే కలియచూస్తున్నారని గ్రహించిన వందన అప్పటికే కారు స్టార్ట్ చేయించి బయటపడింది.

★